


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| బుధవారం 20 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 352 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## గాలివాన బీభత్సం: భైరన్‌దిబ్బలో ఇల్లు ధ్వంసం, తడిసిన ధాన్యం





అల్లాదుర్గ్గా, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: అల్లాదుర్గం మండలంలోని భైరన్‌దిబ్బ గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన వడగండ్ల భారీ వర్షం, ఈదురుగాలులు తీవ్ర బీభత్సం సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురి చేశాయి. ఒక్కసారిగా బలమైన ఈదురుగాలులు వీచడంతో గ్రామంలోని పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద చెట్లు విరిగి రహదారులపై పడిపోయాయి, దీంతో భైరన్‌దిబ్బ నుండి చేవెళ్ల మరియు ముప్పారం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా స్పందించి రహదారులపై కూలిన చెట్ల కొమ్మలను తొలగించే ప్రయత్నాలు చేపట్టారు. మరోవైపు ఈ భారీ వర్షం కారణంగా స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన వడ్లు పూర్తిగా తడిసి ముద్దవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన రక్షణ చర్యలు, టార్పాలిన్ కవర్లు లేకపోవడం వల్లే కష్టపడి పండించిన ధాన్యం నానిపోయి భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేసిన అన్నదాతలు, ప్రభుత్వం తక్షణమే స్పందించి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఇదే గాలివానకు భైరన్‌దిబ్బ గ్రామానికి చెందిన నడిపోల్ల హనుమంతు ఇంటిపై ఉన్న రేకులు పూర్తిగా ఎగిరిపడిపోవడంతో, ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, విలువైన వస్తువులు తడిసి ముద్దయ్యాయి. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరుగుతున్నా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని గ్రామస్థులు విమర్శిస్తుండగా, తక్షణమే దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, బాధిత రైతులకు, నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్ఎంసీ పౌర సేవలు: ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని పౌర సేవలను మరింత సులభతరం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం మీసేవ వాట్సాప్ మరియు చాట్‌బాట్ ద్వారా కొత్తగా మరో తొమ్మిది రకాల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, పారదర్శకత కల్పించే దిశగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో ఈ డిజిటల్ సేవలను విస్తరించినట్లు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ) విభాగం కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది నవంబర్ 18న ప్రారంభమైన ఈ అదనపు డిజిటల్ ఛానల్‌లో ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సేవల పట్ల ప్రజల నుండి విశేష స్పందన లభించిందని, ఈ క్రమంలోనే కొత్తగా జీహెచ్ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన మరియు మరణ ధ్రువీకరణ పత్రాల సవరణలు, బర్త్ హోమ్ (ఇంటి వద్ద జననం), డెత్ హోమ్ (ఇంటి వద్ద మరణం), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ టాక్స్ సేవలు మరియు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ సేవలను ఇందులో చేర్చినట్లు పేర్కొన్నారు. ఈ సేవలను పొందాలనుకునే పౌరులు ముందుగా తమ మొబైల్‌లో 8096958096 నంబర్‌ను 'MeeSeva Telangana' పేరుతో సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో 'Hi' అని సందేశం పంపాల్సి ఉంటుందని వివరించారు. అనంతరం అవసరమైన సేవను ఎంచుకుని, 'Open Service' ఆప్షన్ ద్వారా వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్ చెల్లింపు పూర్తి చేస్తే దరఖాస్తు ప్రక్రియ వెంటనే వాట్సాప్ ద్వారానే నమోదవుతుందని వెల్లడించారు. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని, డిజిటల్ సేవలను నిరంతరం విస్తరిస్తూ ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈఎస్‌డీ విభాగం స్పష్టం చేసింది.



## ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జర్నలిస్టులు ముందుకు సాగాలి: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మరియు పలువురు సీనియర్ జర్నలిస్టులు పిలుపునిచ్చారు. నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జర్నలిస్టుల ప్రత్యేక చర్చా కార్యక్రమంలో సమాచార & పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముకుంద్ రెడ్డి మాట్లాడుతూ, తాను జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారానే సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని గుర్తుచేసుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు ఐ. వెంకట్ రావు, మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, ఉడుముల సుధాకర్ రెడ్డి, దేవులపల్లి అమర్ తదితరులు మాట్లాడుతూ, మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు (AI) ప్రభావం పెరుగుతున్నందున జర్నలిస్టులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ క్లాసులు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములపై ప్రత్యేక శిక్షణలు ఇవ్వాలని సూచించారు. అలాగే నిజాం కాలం నాటి అరుదైన పుస్తకాలు, పాత పత్రికలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందించాలని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని కోరారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కే. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, బండారు శ్రీనివాస్ రావు, మాదభూషి శ్రీధర్ తదితర ప్రముఖ జర్నలిస్టులు పాల్గొనగా, సమావేశం అనంతరం హాజరైన సీనియర్ జర్నలిస్టులందరినీ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు సంయుక్తంగా శాలువాలతో ఘనంగా సత్కరించారు.




## శారీరక సాక్షరత ప్రాముఖ్యం పెరగాలి పుల్లెల గోపీచంద్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: గచ్చిబౌలి స్టేడియం వేదికగా నిర్వహించిన "యూత్ అండ్ స్పోర్ట్స్ వీక్-2026" కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ "ఫిజికల్ లిటరసీ" (శారీరక సాక్షరత) అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. తెలంగాణ క్రీడాశాఖ ఆధ్వర్యంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణలో భాగంగా మే 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ వేడుకలు యువత సాధికారత, ఫిట్‌నెస్ ప్రోత్సాహం ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, శారీరక సాక్షరత ప్రాధాన్యత కేవలం క్రీడాకారులకు మాత్రమే కాకుండా సమాజంలోని ప్రతి వర్గానికీ తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువతలో ఆరోగ్యకర జీవనశైలి, క్రమశిక్షణ, మానసిక దృఢత్వం మరియు క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఫిజికల్ లిటరసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. క్రీడారంగం దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చే ముఖ్యమైన రంగాల్లో ముందుంటుందని, ఆరోగ్యవంతమైన సమాజం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అనంతరం డాక్టర్ ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ స్థాయిలో క్రీడల ప్రోత్సాహంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ క్రీడా వారోత్సవాల ద్వారా శారీరక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, క్రీడల్లో సామాజిక భాగస్వామ్యాన్ని విస్తరించడం మరియు రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ విశేష కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు సుజాత, రవితేజ, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, పలువురు కోచ్‌లు మరియు యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 జాతీయ సమీక్ష సమావేశానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల "స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0" జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 'తెలంగాణ విజన్-2047' లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని సుస్థిరంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు క్షేత్రస్థాయిలో CURE, PURE, RARE అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026కు అనుగుణంగా రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెడుతున్నామని, ఇవి 4-వే సోర్స్ సెగ్రిగేషన్ (నాలుగు రకాలుగా చెత్త వేరు చేయడం) మరియు క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణతో పనిచేస్తాయని వెల్లడించారు. జవహర్‌నగర్ డంప్ యార్డ్ శాస్త్రీయ శుద్ధి కోసం ఐఐటీ బాంబే సాంకేతిక సహకారాన్ని తీసుకుంటున్నామని, అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లోని 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నామని పేర్కొంటూ, భవిష్యత్తులో ఈ డంప్ యార్డులను అభివృద్ధి కేంద్రాలుగా, పార్కులుగా మారుస్తామని స్పష్టం చేశారు. జపాన్‌లోని కిటాక్యుషు నగర అభివృద్ధి మోడల్ ఆధారంగా బండరావిర్యాల, సిద్ధాపూర్ ప్రాంతాల్లో ఎకో టౌన్ నిర్మిస్తూ సర్క్యులర్ ఎకానమీ దిశగా అడుగులు వేస్తున్నామని, 2047 నాటికి భారత్‌ను 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న కేంద్ర లక్ష్యంలో తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల భాగస్వామ్యంతో కీలక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జపాన్ దేశం తరహాలో మొదటి తరగతి నుంచే పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటుపై ఆచరణాత్మక బోధనను అందించేలా అన్ని రాష్ట్రాలు ఆలోచించాలని సూచిస్తూ, వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పాదన, రీసైక్లింగ్ ప్రాజెక్టుల స్థాపన కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (VGF) ద్వారా ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి తోఖన్ సాహు, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీనివాస్ కటికితల, స్వచ్ఛ భారత్ మిషన్ డైరెక్టర్ రూపా మిశ్రా, తెలంగాణ పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మానిక్ రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. ఈ నియామకాల్లో భాగంగా ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున (1:3 నిష్పత్తిలో) అర్హులైన అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు ఆహ్వానించినట్లు బోర్డు వెల్లడించింది. హైదరాబాద్‌లోని వెంగల్‌రావు నగర్‌లో గల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ నెల 22, 23 తేదీలలో ఈ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ జరగనుంది. అభ్యర్థులు తమ విద్యార్హత, కమ్యూనిటీ తదితర అన్ని రకాల ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని బోర్డు స్పష్టం చేసింది. ఒకవేళ అనివార్య కారణాల వల్ల ఈ నెల 22, 23 తేదీల్లో హాజరు కాలేని వారు, ఈ నెల 25వ తేదీన వచ్చి తమ సర్టిఫికెట్లను అందజేసి వెరిఫికేషన్ పూర్తి చేసుకోవచ్చునని బోర్డు మినహాయింపునిచ్చింది. కాగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని 34 డిపార్ట్‌మెంట్లలో మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గతేడాది నోటిఫికేషన్ విడుదలవగా, అందులో పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, అనస్తేషియా డిపార్ట్‌మెంట్లలోని 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే విజయవంతంగా పూర్తయింది. ఆయా పోస్టులకు ఎంపికైన డాక్టర్లకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను కూడా అందజేశారు. మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టులకు సంబంధించిన మెరిట్ లిస్ట్‌ను ప్రస్తుతం విడుదల చేశామని, ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల తుది జాబితాను విడుదల చేస్తామని రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు.



## శాంతినగర్‌లో ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు

సందేశం టైమ్స్, శాంతినగర్, మే 19, ప్రతినిధి: బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు శాంతినగర్ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. చెక్‌పోస్ట్ వద్ద వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అనుమానాస్పద రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. చెక్‌పోస్ట్ ఏర్పాటును పట్టణ సీఐ శివశంకర్ స్వయంగా పరిశీలించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సుధీర్ కుమార్, ఏఎస్ఐ జానీ మియా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్యాపేట జిల్లాలో ముమ్మరంగా ధాన్యపు కొనుగోళ్లు: 39 వేల మందికి పైగా రైతుల నుండి సేకరించిన అధికారులు

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా యాసంగి విద్యా సంవత్సరం రెండు వేల ఇరవై ఐదు - ఇరవై ఆరు సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోందని పౌర సరఫరాల సంస్థ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లాలో మే 19వ తేదీ నాటికి మొత్తం ప్రతిపాదించిన 354 కొనుగోలు కేంద్రాలలో 306 కేంద్రాలు విజయవంతంగా నడుస్తుండగా, ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా మరియు ఎఫ్‌పీఓ వంటి వివిధ ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా ఇప్పటివరకు 39,419 మంది రైతుల నుండి మొత్తం 2,78,367.920 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇందులో సన్న రకం ధాన్యం 7,689.240 మెట్రిక్ టన్నులు కాగా, దొడ్డు రకం ధాన్యం 2,70,678.680 మెట్రిక్ టన్నులుగా నమోదైంది. కొనుగోలు చేసిన ధాన్యంలో ఇప్పటివరకు 2,62,229.720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిరంతరాయంగా రైస్ మిల్లులకు తరలించగా, మిగిలిన 16,138.200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి మొత్తం ధాన్యం విలువ రూ. 665.02 కోట్లు కాగా, రైతుల బ్యాంకు ఖాతాల్లోకి ఇప్పటికే రూ. 422.15 కోట్ల మద్దతు ధర నిధులను నేరుగా జమ చేశామని, మిగిలిన రూ. 242.86 కోట్ల నిధులను త్వరలోనే విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మేనేజర్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

## మండలంలో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు అవగాహన సదస్సు



చింతకాని, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని నేరడ, రామకృష్ణాపురం, బస్సాపురం, నరసింహపురం, రేపల్లెవాడ, పాతర్లపాడు గ్రామాలలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల నాయకుల అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రత్యేక రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో కార్యకర్తలను సభ్యత్వ నమోదు చేయనున్నట్లు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పారదర్శకత పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పూర్తిగా మొబైల్ యాప్ మరియు ఆన్లైన్ విధానంలో డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చింతకాని మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీలు, 50 పోలింగ్ బూతులు ఉన్నాయని, ప్రతి బూత్‌కు ఇద్దరి చొప్పున మొత్తం 100 మంది డిజిటల్ సహాయకులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ పర్యవేక్షణ కోసం మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ప్రధాన కార్యదర్శులను జిల్లా, నియోజకవర్గాల వారీగా ఇన్చార్జులుగా నియమించినట్లు తెలిపారు. స్థానిక స్థాయిలో సభ్యత్వ నమోదును విజయవంతం చేసేందుకు మండల, గ్రామ స్థాయిలో ఐదుగురు సభ్యులతో ప్రత్యేక సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మంకెన రమేష్, బోడు వెంకట రామారావు, గురజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాసరావు, పిన్నెల్లి శ్రీనివాసరావు, కోమట్లగూడెం సర్పంచ్ పరిశుద్ధ రావు, మాజీ సర్పంచులు కన్నబోయిన కుటుంబరావు, చాట్ల సురేష్, నాయకులు సామినేని అప్పారావు, బంధం కృష్ణ, మండేపూడి కృష్ణ ప్రసాద్, నన్నాక గోవిందరావు, నన్నక నరసింహారావు, బొగ్గరపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్‌తో పేర్లు నమోదు చేసుకోవాలి: నాగులవంచ సర్పంచ్ నారగాని రాంబాయి



చింతకాని, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: మండల పరిధిలోని నాగులవంచ గ్రామ పంచాయతీ పరిధిలో గల పెన్షన్ లబ్ధిదారులు అందరూ తమ పేర్లను తప్పనిసరిగా ఆధార్ కార్డుతో నమోదు చేయించుకోవాలని గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, నాగులవంచ గ్రామపంచాయతీ పరిధిలోని వృద్ధాప్య, వికలాంగుల, వితంతు మరియు ఒంటరి మహిళల పెన్షన్ లబ్ధిదారులు తమ యొక్క ఆధార్ కార్డును తీసుకొని గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించి వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ పేరు నమోదు ప్రక్రియ ఈ నెల 15వ తేదీ నుండి వచ్చే జూన్ నెల 5వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, కాబట్టి అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధాప్యం లేదా అనారోగ్య కారణాల వల్ల గ్రామ పంచాయతీ కార్యాలయానికి రాలేని వారు పంచాయతీ కార్యదర్శికి ముందస్తు సమాచారం అందిస్తే, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పరిశీలన పూర్తి చేస్తారని వెల్లడించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపు ఆధార్ నిర్ధారణ చేయించుకోని వారి పెన్షన్లు నిలిపివేయబడతాయని హెచ్చరించిన సర్పంచ్, లబ్ధిదారులందరూ ఈ విషయాన్ని గమనించి అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు.



## వారంలోగా ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి మే 20 : జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రానున్న వారం రోజుల్లో నిర్దేశిత కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలోని రైస్ మిల్లుతో పాటు, పాతర్లపాడు గ్రామంలోని అరోహి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనకల్ మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. అలాగే మద్దిరాల మండల కేంద్రం మరియు గుమ్మడివల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తుంగతుర్తి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని కొనుగోలు కేంద్రంతో పాటు, వెంపటి గ్రామం, రావులపల్లి ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను తనిఖీ చేశారు. తిరుమలగిరి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. నాగారం మండలం ఈటూరి గ్రామంలోని 'సోమేశ్వర రైస్ మిల్లు'ను సందర్శించి అన్‌లోడింగ్ సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఉండేందుకు వీలుగా, పెద్ద ఎత్తున అన్‌లోడింగ్ పాయింట్లను గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రానున్న వారం రోజులు అత్యంత కీలకమని కాబట్టి అధికారులు, మిల్లుల యజమానులు సమన్వయంతో పనిచేసి లారీలను వేగంగా అన్‌లోడ్ చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆత్మకూర్ (ఎస్) తహసిల్దార్ హమీసింగ్, నూతనకల్ తహసిల్దార్ శ్రీనివాసరావు, మద్దిరాల తహసీల్దార్ తబిత, వ్యవసాయ శాఖ ఎ ఓ రుహి, తుంగతుర్తి తాసిల్దార్ దయానంద్, ఎంపీడీవో శేషు కుమార్, ఏ డి ఏ రమేష్ బాబు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎస్సీ విద్యార్థుల దరఖాస్తుల ఆహ్వానం: జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె. దయానంద రాణి

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: సూర్యాపేట జిల్లాలో చదువుతున్న ఎస్సీ విద్యార్థినీ విద్యార్థుల కొరకు రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఆంగ్ల మాధ్యమం ఒకటో తరగతి మరియు ఐదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి శ్రీమతి కె. దయానంద రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000/- మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- లోపు ఉండాలని పేర్కొన్నారు. అర్హులైన వారు కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రాలు (మీసేవ ద్వారా పొందినవి), రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనఫైడ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సూర్యాపేట కలెక్టరేట్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులోని గది సంఖ్య ఎఫ్-3 లో గల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారములు పొందవచ్చని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 6వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు ఇదే కార్యాలయంలో సమర్పించాలని స్పష్టం చేశారు. గతంలో కుటుంబ సభ్యులెవరైనా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లేదా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివి ఉంటే, వారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు కారని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక చిట్టీల ద్వారా (డ్రా పద్ధతిలో) జూన్ 10వ తేదీన ఉదయం 11:00 గంటలకు సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని వెల్లడించారు. నిర్ణీత గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోరని, అలాగే ఒకటో తరగతి ప్రవేశాల కొరకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు జూన్ 13, 2020 నుండి జూన్ 12, 2021 మధ్య కాలంలో జన్మించిన వారు మాత్రమే అర్హులని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎస్సీ విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్ మరియు బేగంపేట్ శాఖలలో ఒకటో తరగతిలో ప్రవేశాల కొరకు అర్హులైన ఎస్సీ విద్యార్థినీ విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తు ఫారములు సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో గల రూమ్ నంబర్ ఎఫ్-3 లో ఉచితంగా లభిస్తాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను మే 29వ తేదీ సాయంత్రం 4:00 గంటల లోపు సమర్పించాలని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా సూర్యాపేట జిల్లాకు చెందిన వారై ఉండాలని, జూన్ 1, 2019 నుండి మే 31, 2020 మధ్య కాలంలో జన్మించి ఉండాలని తెలిపారు. అలాగే తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000/- మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000/- మించరాదని, మీసేవ ద్వారా పొందిన కుల, ఆదాయ, నివాస, జనన ధృవీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డ్ మరియు రేషన్ కార్డ్ నకళ్లను దరఖాస్తుకు జతపరచాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికను లాటరీ పద్ధతి ద్వారా జూన్ 1వ తేదీన ఉదయం 11:00 గంటలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తారని, గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను స్వీకరించబోరని జిల్లా కలెక్టర్ తరపున అధికారులు వెల్లడించారు.

## సబ్సే దూర్, సబ్సే పహ్లే' వారోత్సవ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ: జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్



సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: సూర్యాపేట జిల్లా కేంద్రంలో గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'జన్ బాగిదారి సబ్సే దూర్, సబ్సే పహ్లే' వారోత్సవ అభియాన్ వాల్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ మరియు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. శంకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల అభివృద్ధి మరియు సంక్షేమమే ధ్యేయంగా ఈ నెల 18వ తేదీ నుండి 25వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ 'సబ్సే దూర్, సబ్సే పహ్లే' వారోత్సవాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ పరిపాలనాధికారి కె. మంగ్తా, కార్యాలయ సిబ్బంది శాంతికుమార్, ప్రియాంక, శివరాజ్, నాగరాజ్, సైదా మరియు ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## రానున్న మూడు రోజుల్లో పెరుగుతున్న ఎండలు: సూర్యాపేటలో 45 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ గణనీయంగా పెరుగుతోందని, రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రరూపం దాల్చనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మంగళవారం గరిష్ఠంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బుధవారం నాటికి ఇది 42.8 డిగ్రీలకు, గురువారం నాటికి ఏకంగా 45.0 డిగ్రీలకు మరియు శుక్రవారం నాటికి 46.3 డిగ్రీల అత్యధిక స్థాయికి చేరుకునే అవకాశం ఉందని వాతావరణ ముందస్తు సూచనలు పేర్కొంటున్నాయి. జిల్లాలోని వివిధ మండలాల వారీగా పరిశీలిస్తే, నేరేడుచర్ల మండలం నరసయగూడెంలో అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, పెన్‌పహాడ్ మండలం చీడెళ్లలో 42.2 డిగ్రీలు, గరిడేపల్లిలో 42.0 డిగ్రీలు, మునగాలలో 41.8 డిగ్రీలు, మేళ్లచెరువులో 41.8 డిగ్రీలు, చివ్వెంల మండలం తిరుమలగిరిలో 41.7 డిగ్రీలు, నూతనకల్‌లో 41.6 డిగ్రీలు, మోతే మండలం మామిళ్లగూడెంలో 41.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదేవిధంగా చిలుకూరు, మట్టంపల్లి, నడిగూడెం, సూర్యాపేట, పాలకీడు, హుజూర్‌నగర్, మద్దిరాల, కోదాడ, అనంతగిరి, చింతలపాలెం, ఆత్మకూర్ (ఎస్), తుంగతుర్తి, నాగారం మండలాల్లోని పలు ప్రాంతాల్లో 39.1 డిగ్రీల నుండి 41.4 డిగ్రీల మధ్య ఎండ తీవ్రత కొనసాగింది. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగి, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని మరియు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఘనమైన చరిత్ర కల్గిన మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్ గా తీర్చిదిద్దాలి: జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: మెదక్ జిల్లాకు వేల ఏళ్ల చరిత్ర, అపారమైన సంస్కృతి, సంప్రదాయాలు, కళలు మరియు ఆచారాల పరంగా గొప్ప గుర్తింపు ఉందని, చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తొంబై తొమ్మిది రోజుల కార్యక్రమంలో భాగంగా చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను మరియు వారసత్వ సంపదను కాపాడుకోవాలనే లక్ష్యంతో స్థానిక సి.ఎస్.ఐ. పాఠశాలలోని ఆడిటోరియంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, పూర్వీకులు నిర్మించిన దేవాలయాలు, కోటలు, మసీదులు, పురాతన కట్టడాలు, జానపద కళలు, భాషలు, సాహిత్యం మరియు సంప్రదాయ పండుగలు మన చారిత్రక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయన్నారు. ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, చరిత్ర అనేది కేవలం గతాన్ని గుర్తుచేసేది మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. మన పూర్వీకుల త్యాగాలు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం మరియు కళా వైభవం సమాజ అభివృద్ధికి పునాది వంటివని, మన సంస్కృతికి ప్రత్యేక గుర్తింపు ఉండటానికి మన పురాతన సంపద, వైవిధ్యభరితమైన సంప్రదాయాలే కారణమని వివరించారు. అనంతరం మున్సిపల్ ఛైర్పర్సన్ కనుగుల రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ, యువత తమ సంస్కృతి, చరిత్ర పట్ల అవగాహన పెంచుకొని వాటి పరిరక్షణలో ముందుండాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో చారిత్రక వారసత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అలాగే జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మాట్లాడుతూ, పురాతన దేవాలయాలు, శిల్పాలు, చారిత్రక కట్టడాలను రక్షించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. పర్యాటక అభివృద్ధితో పాటు చారిత్రక ప్రాంతాల పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మన సంస్కృతి మన ఆత్మగౌరవానికి ప్రతీక అని, భాష, సాహిత్యం, కళలు, సంప్రదాయాలు నిలిచి ఉంటేనే సమాజం బలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో స్థానిక చరిత్ర, పురాతన సంపద, కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, పలువురు కవులు, రచయితలు, ఉపాధ్యాయులు, పౌరులు మరియు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వేగంగా ధాన్యం కొనుగోలు: 26,191 మంది రైతుల ఖాతాల్లో రూ. 260.03 కోట్లు జమ చేసినట్లు తెలిపిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: మెదక్ జిల్లాలో గతంలో కంటే అత్యంత వేగంగా మరియు పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శక విధానంలో ఈ రోజు వరకు మొత్తం 37,072 మంది రైతుల వద్ద నుండి 1,85,688.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆమె వెల్లడించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే 26,191 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ. 260.03 కోట్ల నిధులను నేరుగా జమ చేయడం జరిగిందని వివరించారు. రానున్న రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించడంతో పాటు, అకాల వర్షాల ముప్పు నుండి ధాన్యాన్ని కాపాడడానికి కొనుగోలు కేంద్రాల్లో తగినన్ని టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైస్ మిల్లర్లు కూడా లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం కల్పించిన కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధరకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.

# డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న మెదక్



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తూ మెదక్ నియోజకవర్గ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలో నియోజకవర్గం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ (ఎంఎస్ఎస్ఓ) ద్వారా కూడా ఆయన నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే మెదక్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. రామాయంపేట మండలంలో ఇరవై రెండు మంది లబ్ధిదారులకు, నిజాంపేట్ మండలంలో మరో పన్నెండు మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎమ్ఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. అలాగే నిజాంపేట్ మండలంలోని రాంపూర్ గ్రామంలో తన సొంత నిధులతో ఒక వంటగది షెడ్ మరియు రెండు మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, మస్లక్ మరియు నందగోకుల్ గ్రామాల్లో రెండు బోర్‌వెల్‌లను ఏర్పాటు చేసి గ్రామస్థుల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారు. వీటితో పాటు నిజాంపేట్ మండల కేంద్రంలో మరో వంటగది షెడ్ మరియు ఆరు మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయగా, ఈ మొత్తం అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలకు సుమారు రూ. 1.20 కోట్ల వ్యయం అయినట్లు సమాచారం. గ్రామీణాభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్యం, వైద్య సహాయం, పేదల సంక్షేమం వంటి రంగాల్లో ఆయన చేస్తున్న సేవలు ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్నాయి. ఒకప్పుడు అభివృద్ధికి దూరంగా ఉన్న మెదక్ నేడు రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, గ్రామీణ మౌలిక వసతులు, ప్రజా సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాలతో రూపురేఖలు మార్చుకుంటూ రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తోంది. ఈ పర్యటన కార్యక్రమాల్లో రామాయంపేట మరియు నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఇండ్ల గణన ప్రక్రియ పారదర్శకంగా కచ్చితంగా జరగాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: జనగణన రెండు వేల ఇరవై ఏడు మొదటి విడతలో భాగంగా జిల్లాలో ఇండ్ల గణన ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా మరియు పారదర్శకంగా నిర్వహించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. రేగోడ్ మండల కేంద్రంలోని కొత్వాన్‌పల్లిలో మంగళవారం క్షేత్రస్థాయిలో సాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యూమరేటర్లతో మాట్లాడుతూ, ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యూమరేటర్ల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా ప్రతి ఇంటి స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలని సూచించారు. మొదటి దశలో భాగంగా మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహించబడుతుందని, ఈ గడువులోగా ప్రతి కుటుంబం యొక్క వివరాలను పక్కాగా సేకరించి నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేలో సేకరించిన ప్రజల వివరాలన్నింటినీ అత్యంత గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సర్వేకు వెళ్లే సిబ్బంది తమ వెంట ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను తప్పనిసరిగా తీసుకెళ్లాలని, ఆరోగ్య విషయాల్లో తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. అదేవిధంగా సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరిస్తూ, వారు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు చెప్పాలని, దీనివల్ల ప్రభుత్వానికి సరైన గణాంకాలు అందుతాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.

# భారీ వర్షాలకు కూలిన నీలగిరి చెట్టు: ఎంపీపీఎస్ బొడ్మట్‌పల్లి పాఠశాల ఆస్తికి నష్టం



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: నిన్న కురిసిన భారీ వర్షాల కారణంగా మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) ఆవరణలో ఉన్న ఒక పెద్ద నీలగిరి చెట్టు ఒక్కసారిగా పాఠశాల భవనంపై మరియు కాంపౌండ్ వాల్‌పై కూలిపోవడంతో పాఠశాల ఆస్తి కొంతమేర దెబ్బతిన్నట్లు ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయ బృందం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భద్రతే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రస్తుతానికి ప్రమాద స్థలాన్ని ఎవరూ సమీపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ ప్రమాద విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులకు మరియు స్థానిక ప్రజాప్రతినిధులకు ఇప్పటికే పూర్తి సమాచారం అందించడం జరిగిందని, కూలిన చెట్టు శిథిలాల తొలగింపుతో పాటు పాఠశాల మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. పాఠశాల పునర్నిర్మాణం, తరగతుల నిర్వహణ మరియు పిల్లల భద్రతకు సంబంధించిన తదుపరి పూర్తి వివరాలను (అప్‌డేట్స్) త్వరలోనే విద్యార్థుల తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేస్తామని, అంతవరకు గ్రామ ప్రజలందరూ పాఠశాల సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించవలసిందిగా ప్రధానోపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

# అత్యవసర మందుల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు: మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: అఖిల భారత ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు మే 20వ తేదీన దేశవ్యాప్త బంద్ నిర్వహిస్తున్న నేపథ్యంలో మెదక్ జిల్లాలోని మెడికల్ షాపులు ఎక్కువగా మూసివేయబడే అవకాశం ఉందని, ఈ క్రమంలో ప్రజలకు అత్యవసర మరియు ప్రాణరక్షక మందుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) తరఫున ప్రత్యేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, బంద్ సమయంలో ప్రజలకు అత్యవసర మందులు కావలసి వస్తే సంప్రదించడానికి ప్రత్యేక హెల్ప్ డెస్క్ నంబర్లను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. అందుకోసం ప్రజలు 9440155858, 9440025572, 9985466335 నంబర్లతో పాటు డీసీఏ హెల్ప్‌లైన్ నంబర్ 1800-599-6968 లేదా మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ మొబైల్ సంఖ్య 8333818140 లలో సంప్రదించవచ్చని సూచించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న అన్ని అంతర్గత ఫార్మసీలు (మెడికల్ షాపులు) నిరంతరాయంగా మందుల సరఫరాకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ బంద్ నేపథ్యంలో జిల్లా ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సమయాల్లో ఈ ప్రత్యామ్నాయ సేవలను మరియు హెల్ప్ డెస్క్ నంబర్లను వినియోగించుకోవాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ కోరారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంపై బీజేపి ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారులు మరియు రైస్ మిల్లుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల తహశీల్దార్‌ను కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత కారణంగా రవాణా పూర్తిగా నిలిచిపోయిందని, కాంటా (తూకం) వేసిన వడ్ల బస్తాలు సగానికి సగం కూడా ఇంకా రైస్ మిల్లులకు తరలించకపోవడంతో వారం రోజులుగా సొసైటీల వద్దనే మూలపడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉరుములతో కూడిన అకాల వర్షాలు పడుతుండటంతో తూకం వేసిన ధాన్యం తడిసి ముద్దవుతోందని, బస్తాలను కాపాడటానికి కనీసం టార్పాలిన్ కవర్లు కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. తీవ్రమైన ఎండల కారణంగా కొనుగోలు కేంద్రాల వద్దనే వేచి ఉంటున్న రైతులు ఎండదెబ్బకు గురవుతున్నారని, కాబట్టి తక్షణమే ప్రతి కేంద్రం వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ సర్కార్ ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని, యుద్ధప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేసి మిల్లులకు తరలించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ ఎత్తున రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యేన్ రెడ్డి, జిల్లా నాయకులు శ్రీపాల్, మండల ప్రధాన కార్యదర్శి ప్రభు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు సత్యం, మండల కార్యదర్శి సురేందర్ గౌడ్, బిజెవైఎం నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి మరియు మండల బీజేపీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో నిర్లక్ష్యం: మరో నాలుగు రైస్ మిల్లులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: మెదక్ జిల్లాలో యాసంగి మార్కెటింగ్ సీజన్ రెండు వేల ఇరవై ఐదు - ఇరవై ఆరు ధాన్యం సేకరణ మరియు కస్టమ్ మిల్లింగ్ (సీఎమ్ఆర్) ప్రక్రియలో తీవ్ర అలసత్వం వహించిన మరో నాలుగు రైస్ మిల్లులపై జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిని పెట్టి, కొనుగోలు కేంద్రాల (పీపీసీ) నుండి కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో దిగుమతి చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కుల్చారం మండలంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ (కోనాపూర్), వేణుగోపాల స్వామి బిన్నీ మోడరన్ రైస్ మిల్ (శివపల్లి), ఎమ్ఎస్ శ్రీ శ్రీనివాస మోడరన్ బిన్నీ రైస్ మిల్ (గోమారం) మరియు శ్రీ మాతా ట్రేడింగ్ కో (దొంతి శివారు) మిల్లులను తక్షణ ప్రభావంతో ధాన్యపు సేకరణ మరియు కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్ నుండి బ్లాక్‌లిస్ట్‌లో చేరుస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని రైస్ మిల్లులు తప్పనిసరిగా మిల్లింగ్ ఆపరేషన్స్‌లో పాల్గొనాలని పలుమార్లు ఆదేశించినప్పటికీ సదరు మిల్లర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. మిల్లుల నిర్లక్ష్యం కారణంగా క్షేత్రస్థాయిలో రైతులకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన ఈ నాలుగు మిల్లులకు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఎలాంటి ప్రభుత్వ ధాన్యాన్ని కేటాయించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, రైతులను ఇబ్బందులకు గురిచేసే ఏ ఒక్క మిల్లరును వదిలిపెట్టేది లేదని మరియు నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# కాంటా, రవాణా ఒకేసారి వేగంగా జరగాలి: జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: ప్రస్తుత అకాల వర్షాల నేపథ్యంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు మరియు రవాణా ప్రక్రియలు ఒకేసారి అత్యంత వేగంగా జరగాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. తూప్రాన్ మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో ఉన్న సాయినాథ్ రైస్ మిల్లును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులోని ధాన్యం నిల్వలు, అన్‌లోడింగ్ అవుతున్న తీరును పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, కాబట్టి అన్నదాతలు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని వివరించారు. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడడానికి తగినన్ని టార్పాలిన్ కవర్లను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను, నిర్వాహకులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో లోడింగ్ ప్రక్రియను వేగంగా చేపట్టేందుకు వీలుగా అవసరమైనంత మంది హమాలీలను (లేబర్), లారీలను ముందస్తుగానే అందుబాటులో ఉంచుకోవాలని, నిబంధనల మేరకు ధాన్యంలో సరైన తేమ శాతం ఉండేలా చూసుకోవాలని మిల్లు నిర్వాహకులకు స్పష్టం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించి అన్‌లోడ్ చేయించాలని ఆదేశించిన ఈ కార్యక్రమంలో మిల్లు నిర్వాహకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రోజు 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన: మంత్రి గడ్డం వివేక్



పటాన్‌చెరు, సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్, మే 20: రాజకీయాలకు అతీతంగా ఇంద్రేశం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. సోమవారం ఉదయం పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో గల ఐనోలు, కంజర్ల, పెద్ద కంజర్ల, కొత్తకాలనీ, ఆర్ కే నగర్ కాలనీలలో రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు మరియు తాగునీటి సరఫరా పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఈ అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేశామని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని, దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను సైతం శాశ్వతంగా పరిష్కరించబోతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ప్రగతి కోసం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కాట శ్రీనివాస్ గౌడ్, వైస్ ఛైర్మన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, యువ నాయకుడు హర్ష రెడ్డి, లక్ష్మీ జంగయ్య, రాచమల్ల అనిల్ గౌడ్ మరియు పార్టీలకతీతంగా పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కోదాడలో 75 బైక్‌ల సీజ్, వాహనదారులకు కౌన్సిలింగ్





కోదాడ, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: కోదాడ పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడుపుతున్న వారిపై స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణించడం (ట్రిపుల్ రైడింగ్), మైనర్ డ్రైవింగ్, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడటం (సెల్‌ఫోన్ డ్రైవింగ్) వంటి నిబంధనలను ఉల్లంఘించిన మొత్తం 75 మోటార్ సైకిళ్లను పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా పట్టుబడిన వాహనదారులకు, మైనర్ల తల్లిదండ్రులకు పోలీస్ స్టేషన్‌లో సిఐ కౌన్సిలింగ్ ఇస్తూ, నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందని, ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాల బారిన పడేయవద్దని హెచ్చరించారు. భవిష్యత్తులో నిబంధనలు ఉల్లంఘిస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కోదాడ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) అంజిరెడ్డి, టౌన్ ఎస్ఐలు సుధీర్, మల్సూర్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మరెడ్డిగూడెంను సందర్శించిన స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ స్వామి



చౌటకూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల పరిధిలోని బొమ్మరెడ్డిగూడెం గ్రామాన్ని మంగళవారం నాడు స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ స్వామి, మండల ఏపీఓ రామ్మోహన్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా గ్రామంలో నిర్మించిన మరియు నిర్మించబోయే సామూహిక మరుగుదొడ్ల స్థలాలను, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా డ్రైన్ ఎండ్ ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ స్వామి మాట్లాడుతూ, గ్రామాన్ని సంపూర్ణ స్వచ్ఛ గ్రామంగా మార్చేందుకు మరియు పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రతి ఒక్కరూ సామూహిక మరుగుదొడ్లను, ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలని, నిబంధనల ప్రకారం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బొమ్మరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్, స్థానిక నాయకులు సర్వన్ నాయక్, గణపతి నాయక్, మూడ్ రాజు, సంతోష్, అభిలాష్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన



పటాన్‌చెరు, సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్, మే 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్‌నగర్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో రూ. 60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా ఉస్మాన్‌నగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ అగ్రస్థానంలో నిలవడం పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని, రాబోయే రోజుల్లో విద్యార్థినులకు మరిన్ని మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ పాఠశాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చిన ఈ అట్టహాసపు కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు ఉపాధ్యాయ బృందం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కవితమ్మ సమక్షంలో ఉమ్మడి వరంగల్ నేతల కీలక సమావేశం: టీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



వరంగల్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత సమక్షంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకుల కీలక సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణతో పాటు గ్రామ స్థాయిలో జెండా గద్దెల నిర్మాణం మరియు పార్టీ పటిష్టతపై కవితమ్మ నాయకులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా హన్మకొండ జిల్లాకు చెందిన పలువురు యువత మరియు మహిళలు కవితమ్మ సమక్షంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీలో భారీగా చేరారు. పార్టీలో చేరిన వారికి ఆమె గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో కవితమ్మ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త మరియు నాయకుడు నిరంతరం శ్రమించాలని, ప్రజల సమస్యలపై పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు 'జై తెలంగాణ.. జై తెలంగాణ రక్షణ సేన.. జై టీఆర్ఎస్.. జై కవితమ్మ' అంటూ చేసిన నినాదాలతో సభా ప్రాంగణం అంతా మార్మోగింది. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: 15 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనలో బీఆర్ఎస్ నాయకులు



పటాన్‌చెరు, సందేశం టైమ్స్ ప్రతినిధి వి. సాయి, మే 20: పటాన్‌చెరు ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో రూ. 15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ కాలనీల అభివృద్ధి పనులకు మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇంద్రేశం చౌరస్తా వద్ద గల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కౌన్సిలర్ రామేశ్వరం బండ అంతిరెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ పట్లోల శివారెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థి రాచమల్ల అనిల్ గౌడ్ మరియు ప్రముఖ నాయకుడు బండి శంకర్ పాల్గొని శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండి శంకర్ మాట్లాడుతూ, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి కాలనీని అన్ని రకాల మౌలిక వసతులతో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే ప్రతి నెల 19వ తేదీన ఇంద్రేశం చౌరస్తాలోని శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, కావున భవిష్యత్తులో జరిగే కార్యక్రమాలలో హిందూ బంధువులు, శివాజీ భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంద్రేశం చౌరస్తా నుండి మున్సిపాలిటీ కార్యాలయం వరకు కార్యకర్తలు, స్థానికులతో కలిసి భారీ ర్యాలీగా తరలివెళ్లి అధికారిక శంకుస్థాపన మహోత్సవాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, శివాజీ భక్తులు మరియు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఈదురుగాలుల బీభత్సం: పోసానిపేట్‌లో ఇంటిపై కూలిన వేపచెట్టు



అందోల్, సందేశం టైమ్స్ ప్రతినిధి, మే 20: అందోల్ మండల్ పరిధిలోని పోసానిపేట్ గ్రామంలో సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ప్రజలను భయాందోళనకు గురి చేసింది. గ్రామంలో ఒక్కసారిగా వాతావరణం మారి బలమైన గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు విరిగిపడిన ఘటనలు చోటుచేసుకోగా, ఈ క్రమంలో గ్రామంలోని హనుమాన్ ఆలయం ముందు ఎన్నో ఏళ్లుగా ఉన్న ఒక పెద్ద వేపచెట్టు ఒక్కసారిగా విరిగి సమీపంలో నివసిస్తున్న అయ్యప్ప రాజు ఇంటిపై పడింది. అయితే ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు, దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు, గ్రామస్థులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గొడ్డళ్లు, రంపాలతో చెట్టు కొమ్మలను తొలగించే పనులు చేపట్టారు. భారీ వర్షం మరియు గాలుల కారణంగా గ్రామంలో విద్యుత్ సరఫరాకు కూడా తీవ్ర అంతరాయం కలిగింది. గ్రామంలో మరికొన్ని పాత చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాత చెట్లు, బలహీనమైన విద్యుత్ స్తంభాలు ప్రమాదాలకు కారణమవుతాయని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరియు సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.